

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కాని దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## ఏక్‌బార్ ఫిర్

**భాష:** హిందీ, **దర్శకత్వం** – వినోద్ పాండే; **నటీనటులు** – దీప్తినావల్, సురేష్ ఒబెరాయ్; ప్రదీప్ వర్మ

**విడుదల:** 1980




**మన దేశంలో** స్త్రీ పురుష సంబంధాలు, స్త్రీలకు పురుషులకు ఉన్న వ్యక్తిగతమైన స్వేచ్చా సమానవత్వాల విషయానికి సంబంధించి లిఖిత చట్టాల్లోనూ, అలిఖిత కట్టుబాట్లలోనూ ద్వంద్వ విధానాలే అమలులో ఉన్నాయి. ఇద్దరికీ రెండు వేర్వేరు విలువలే అపాదించబడి ఉన్నాయి. పురుషాధిపత్య సమాజం కనుక కుటుంబంలోనూ, బయటి సమాజంలోనూ ద్వంద్వ విధానాలే అమలులో ఉన్నాయి సమానత్వానికి ప్రతిచోటా గండికొట్టే పద్దతే ప్రస్ఫుటమవుతుంది. ఆర్థికపరమైన విషయాల్లోనూ సెక్సుకు సంబంధించిన అంశాల్లోనూ స్త్రీ పురుషులిద్దరికీ భిన్నమైన విలువల్ని అపాదించి పెట్టారు. పురుషులకు స్వేచ్చా స్వాతంత్రాలూ, స్త్రీలకు తీవ్రమైన ఆంక్షలూ



మన సమాజంలో అమలులో ఉండడం మనం గమనించవచ్చు. అయితే ఎలాంటి బంధనాలులేని స్వేచ్ఛను కాంక్షించడం కాదు కాని నిబంధనలు, హద్దులు ఇరుపక్షాలకూ సమంగా ఉండలన్నదే ప్రజాస్వామ్యవాదన. శీలం పరంగా స్త్రీని ఎంత త్వరగా చెడిపోయిందనే ముద్రను ఈ సమాజం వేస్తుందో అంత త్వరగా కాదుకదా కనీసం చెడిపోయిన పురుషుడు అనడానికే ఈ సమాజం మీనమేషాలు లెక్కపెడుతుంది.

ఇలా సంక్లిష్టంగానూ, పాక్షిక ప్రాముఖ్యాలతోనూ నిండి ఉన్న మన సమాజ విలువల గురించి దాదాపుగా సాహిత్యంతో సహా అన్ని కళారూపాలూ పట్టించుకున్నాయి. చర్చించాయి. స్త్రీ పురుష సంబంధాల్ని, స్త్రీ పురుష సెక్స్ విషయాలని వివరంగా పట్టించుకుని నిర్మితమయిన చిత్రాలు మనకు తక్కువే. కాని స్త్రీ పురుషుల స్వేచ్ఛ, భావజాల స్వేచ్ఛ తదితరమైన అంశాల్లో స్త్రీ పరంగా ఆలోచన చేసి దాదాపుగా మొదటి ప్రయత్నంగా నిర్మించబడిన హిందీ చిత్రం 'ఏక్ బార్ ఫిర్'. 1979లో నిర్మించిన ఈ చిత్రానికి దర్శకుడు వినోద్ పాండే ఆ సినిమా ఆనాడు ఓ పెద్ద సంచలనం. భావజాలపరంగా స్త్రీ పక్షపాతం వహించడమే కాకుండా చిత్రీకరణ విషయంలో కూడా డిమ్ లైటింగ్‌తో కొంత స్పష్టాస్పష్టంగా చిత్రీకరించబడిన సెక్స్ దృశ్యాలు ఆనాడు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. చిత్రంలో వినోద్ పాండే బోల్డ్ అటెంప్ట్ చేశాడనే చెప్పుకోవచ్చు. దీప్తినావల్, సురేష్ ఒబెరాయ్, ప్రదీప్ వర్మలు ప్రధాన భూమికల్ని పోషించారు.

చిత్ర ప్రధాన కథాంశం విషయానికి వస్తే లక్నోకు చెందిన ఓ అందమైన అమ్మాయికి హిందీ చిత్రరంగంలో ప్రముఖ నటుడిగా వెలుగొందుతున్న ఓ నటుడితో అనుకోకుండా వివాహమైపోతుంది. ఆ అమ్మాయి కొంత కళాత్మకమైన ప్రతిభ, ఆసక్తి కలిగి ఉన్న అమ్మాయి పెళ్ళయిన కొంత కాలానికే, ఓ హిందీ షూటింగ్ కోసం భర్తతో లండన్ వెళుతుంది ఆమె. అక్కడ ఆమెకు అనేక ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. గొప్పనటుడు, మంచివాడు, ప్రముఖుడు ప్రేమాస్పదుడూ అనుకున్న తన భర్తలోని మరో కోణం ఆమెను చకితురాలను చేస్తుంది. పైకి కనిపించేదంతా ముసుగు మాత్రమేనని ఆ ముసుగుని తొలిగిస్తే అసలు వాస్తవాలు బయటికి అసలు వాస్తవాలు బయటికి వస్తాయన్న విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతుంది. భర్త తాగుబోతు, స్త్రీలోలుడు అని తెలియడమే కాక ఓ రాత్రి అతని స్త్రీలోలత్వం ఆమె కంటబడడంతో ఆమె తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతుంది. అప్పటిదాకా కన్న ఆమె కలలు, ఊహలు అన్నీ కూలిపోతాయి. పెద్ద షాక్‌కు గురైన ఆమె లండన్‌లోనే పెయింటింగ్ క్లాసులో చేరుతుంది. తీవ్రమైన క్షోభతో మానసిక ప్రశాంతత కోసం పెయింటింగ్ నేర్చుకుంటున్న ఆమెకు అక్కడ ఓ భారతీయ మిత్రుడు కలుస్తాడు. ఆ ఇద్దరి మధ్య చనువు పెరుగుతుంది. తీవ్రమైన వేదనకు, ఒంటరితనానికి గురైన ఆమెకు ఆ మిత్రుడిలో ఆలంబన దొరుకుతుంది. ఇద్దరూ మరింత దగ్గరై ప్రేమలో పడతారు. ఆమె భర్త షూటింగులు పూర్తిచేసుకుని ఆమెను పెయింటింగ్ కోర్సు పూర్తి చేసుకుని రమ్మని చెప్పి బాంబే వెళ్ళిపోతాడు.

కొన్ని రోజుల తర్వాత దీపావళి పండగకి ఇండియాకి తిరిగి రమ్మని ఇండియానుంచి ఫోన్ చేసిన భర్తకు 'నేను తిరిగిరావడం లేదు' అని జవాబు చెబుతుంది. సినిమా చివరి షాట్‌లో ఆమె ఇంటిముందు మెట్లపైన ఆమె, మిత్రుడు పక్కపక్కనే కూర్చుని ఉండగా చిత్రం ముగుస్తుంది. అక్కడ ఆ ఇద్దరూ భవిష్యత్తులో పెళ్ళి చేసుకుంటారా! లేదా! చేసుకోవచ్చు లేదా స్నేహితులుగానే ఉండిపోవచ్చు.. ఇలా ఏ స్పష్టమైన అభిప్రాయాన్ని ఇవ్వకుండా చిత్రాన్ని ఓపెన్ ఎండింగ్‌తో ముగించాడు దర్శకుడు వినోద్ పాండే రెండు దశాబ్దాల క్రితం స్త్రీ కోణం ఆలోచించి స్వేచ్ఛా విలువల్ని చర్చించిన చిత్రంగా భారతీయ చిత్ర చరిత్రలో మిగిలిపోయింది.

✡✡✡

# ఆంధీ

**భాష:** హిందీ, **కథ** - కమలేశ్వర్; **సంగీతం** - ఆర్డీబర్మన్; **స్క్రీన్ ప్లే - పాటలు - దర్శకత్వం** - గుల్జార్;

**నటీనటులు** - సుచిత్రా సేన్, సంజీవ్ కుమార్

**విడుదల:** 1975




**రెండున్నర దశాబ్దాల క్రితం** అప్పుడప్పుడే ఆధునికమవుతున్న సమాజం, దాంతో పాటు కుటుంబంలోనూ, భార్యాభర్తల మంధ్య అనుబంధాల్లోనూ గుర్తించదగిన స్థాయిలో మార్పులు కనిపించసాగాయి. స్త్రీలు గడపదాటి తమ వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకుంటూ తమదైన ఒక జీవితాన్ని రూపు దిద్దుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టిన కాలమిది. అప్పటికే మన దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ రావడం స్త్రీ అబల కాదు సబల అన్నభావం క్రమంగా పుంచుకోవడం 1970-80ల మధ్యే మొదలైంది.

ఇలాంటి నేపథ్యంలో ప్రముఖ కవి, దర్శకుడు గుల్జార్ భార్యా భర్తల సంబంధాల్ని 'ఉమన్ ఎంపవర్‌మెంట్' భావాల్ని చర్చిస్తూ చక్కటి చిత్రం నిర్మించారు. అది 'ఆంధీ' (1975). ఈ చిత్రనిర్మాణం మొదలై విడుదల అయ్యేంత వరకూ తీవ్రవివాదాన్ని రేకెత్తించింది. అందులోని స్త్రీ పాత్ర శ్రీమతి ఇందిరా గాంధిని పోలి ఉందని ఆమె జీవిత చరిత్రనే ఆంధీగా తీశారని వాస్తవాల్ని వక్రీకరించారని వాదనలు ప్రచారంకావడంతో చిత్రం నిషేధానికి గురైనంత పనైంది. చివరికి అత్యున్నత స్థానాల్లోని వారి జోక్యంతో చిత్రం విడుదలయింది.

వాద వివాదాల మాట ఎలా ఉన్నా చిత్ర కథనం యావత్తూ ఒకే స్ట్రక్చర్‌లో సాగి ప్రేక్షకునికి హాయిని గొలుపుతుంది. కథాంశం విషయానికి వస్తే ఓ ప్రముఖ హోటల్ యజమాని భార్య తనకున్న రాజకీయ అభిలాష మేరకు పార్టీలో చేరి రాజకీయ కార్యక్రమం వైపు మక్కువ చూపుతుంది. ఫలితంగా భర్తనుంచి దూరమవుతుంది. ఆమె తండ్రి రాజకీయంగా పలుకుబడి కలవాడై ఉంటాడు. తన తర్వాత పార్టీని అధికారాన్ని నడిపించడానికి తన ఏకైక కూతురైన ఆమెను రాజకీయాల్లోకి తెచ్చి క్రమంగా ఎదగడానికి దోహదపడతాడు. ఫలితంగా భార్యా భర్తలిద్దరూ విడిపోయి ఎవరి జీవితాల్లో వారు పయనిస్తూ ఉంటారు. తమ ఏకైక కూతుర్ని బోర్డింగ్ స్కూల్‌లో చేర్పిస్తారు.

అనేక సంవత్సరాల తర్వాత ఓ చిన్న పట్టణానికి ఓ కార్యక్రమం కోసం వచ్చిన ఆమె ఒంటరిగా అతన్ని కలుస్తుంది. అనేక ఏళ్ళుగా అంతర్లీనంగా ఉన్న ప్రేమ వారిద్దరి మధ్య ఉవ్వెత్తున ఎగిసి పడుతుంది. కాని వారి కలయిక స్కాండల్‌గా ప్రచారమవుతుంది. ఆమె ధైర్యంగా అతను తన భర్త అని పబ్లిక్‌గా ప్రకటిస్తుంది. జనం ఆమె మాటల్ని సంతోషంగా స్వీకరిస్తారు. ఎన్నికల్లో ఆమె గెలుస్తుంది. భర్త ఆమె చెంతకు వచ్చి వచ్చి ఢిల్లీ వెళ్ళమని మరిన్ని ఉన్నతమయిన పదవులు అందుకోమని ప్రోత్సహించి సాగనంపుతాడు. భవిష్యత్తులో

ఎప్పుడయినా కలుసుకుందాం అనే ఆశావాహమయిన ఓపెన్ ఎండింగ్‌తో భర్త తిరిగి వెళ్ళిపోతాడు. కథని గుల్జార్ ప్రతిభావంతంగా చిత్రీకరించారు. వర్తమానం, ఫ్లాష్ బాక్‌ల నడుమ కథనం సాగుతూ టెలిస్కోపిక్ ఫిల్మింగ్‌లో సినిమా నడుస్తుంది. అయితే ఎక్కడా లూప్ తెగిపోవడం కాని, అస్పష్టతకు కాని అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో చిత్రం సాఫీగా అనిపిస్తుంది.

భర్తగా సంజీవ్ కుమార్ తన గంభీర ముద్రతో హుందాగా నటించాడు. సంక్లిష్టమైన భార్య పాత్రను సుచిత్రా సేన్ పోషించారు. భావ ప్రకటనల్లో ఆమె ప్రతిభ నిలక్షణంగా కనిపిస్తుంది. ఇద్దరు మహానటుల మధ సంవాదమూ, సహజీవనమూ, సంక్షోభమూ అన్నీ సీరియస్‌గా నడుస్తాయి. అయితే గుల్జార్ పాటలు, ఆర్డీబర్మన్ సంగీతం ఎంతో హుందాతనాన్ని అందించాయి. అయితే గుల్జార్, కమలేశ్వర్ ఎంతగా కాదని వారించినా సుచిత్రా సేన్ ఆహార్యం మానరిజంలు ఇందిరా గాంధీని పోలి ఉండడం మనం గమనించ స్త్రీ వ్యక్తిత్వ విఖాసాన్ని, ఎదుగుదలన్ విజయాల్ని ఈ చిత్రం పెద్దపీట వేసి చూపించింది. అలా విజయాలు సాధించడడం కోస్మ వివాహబంధాన్ని త్రోసి రాజన్న ధైర్యాన్ని కూడా ఆమె ప్రదర్శించడం ఈ చితంలోని ప్రగతిశీల అంశం. ప్రేమలూ, భార్యాభర్తల అనుబంధాలు అన్నీ నిజమే, అవసరమే. కాని అవి వ్యక్తిగా స్త్రీ ఎదుగుదలకి ఆటంకాలు కారాదు. అలా అడ్డుగోడలుగా నిలిచినపుడు వాటిని దాటి వెళ్ళిపోవడమే స్త్రీ కర్తవ్యం. ఈ విషయాన్ని 'ఆంధీ' 1975 లోనే విశ్లేషించడం గొప్ప విషయమే. దర్శకుడు గుల్జార్ చలనచిత్ర జీవితంలో ఆంధీ ఓ మంచి సినిమా



✡✡✡